

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 26 అక్టోబర్ 2026 | పేజీలు : 04


## త్రిముఖ పోటీలో

# తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ పదవి

### - వైఎస్ఆర్‌సిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల మధ్య బిగ్ ఫైట్

### - 48 వార్డులకు 30 వార్డు కౌన్సిలర్లను ఏకగ్రీవం చేసుకున్న టిడిపి - 18 వార్డులకు ఎన్నికలు



మున్సిపల్‌చైర్‌పర్సన్ టిడిపి అభ్యర్థి రేష్మ పర్వీన్



మున్సిపల్‌చైర్మన్ వైసిపి అభ్యర్థి ఫయాజ్‌బాష



ఏకగ్రీవమైన వారికి డిక్లరేషన్ ఫారాలు అందచేసిన దృశ్యం

**తాడిపత్రి అర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. టిడిపి, వైఎస్ఆర్‌సిపి, కాంగ్రెస్ పార్టీల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. టిడిపి నుంచి రేష్మ పర్వీన్, వైఎస్ఆర్‌సిపి నుంచి ఫయాజ్‌బాష, కాంగ్రెస్ పార్టీ నుంచి మహమ్మద్‌అన్వర్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థి మహమ్మద్ అజాన్ ఫిరోజ్ బరిలో ఉన్నారు. ప్రధానంగా టిడిపి వైఎస్ఆర్‌సిపి అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. తాడిపత్రి మున్సిపాలిటీకి 48 వార్డు కౌన్సిలర్ స్థానాలు ఉండగా 30 వార్డులను టిడిపి ఏకగ్రీవం చేసుకుంది. 18 వార్డుల్లో వైఎస్ఆర్‌సిపి, టిడిపి, స్వతంత్రులు పోటీలో ఉన్నారు. నవంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో వారి బౌతవ్యం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఏకగ్రీవమైన అభ్యర్థులకు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందచేశారు. ఏకగ్రీవమైన వారిలో 1వ వార్డు మహబూబ్‌బాషా, 2వ వార్డు ఫరూక్, 5వ వార్డు ఉషారాణి, 6వ వార్డు లక్ష్మీకుమార్, 7వ వార్డు టంగుటూరి స్వప్న, 8వ వార్డు షేక్ తస్నీం, 14వ వార్డు బింగి చంద్రకళ, 15వ వార్డు స్వాతి, 17వ వార్డు తలారి అరుణ, 18వ వార్డు రేణుకాదేవి, 20వ వార్డు వెంకటపరమేష్, 21వ వార్డు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, 22వ వార్డు జింక లక్ష్మీదేవి, 24వ వార్డు హుస్సేన్‌బాష, 26వ వార్డు రామకృష్ణారెడ్డి, 28వ వార్డు శరత్‌బాబు, 29వ వార్డు జయసుధ, 31వ వార్డు సాకే అశ్విని, 32వ వార్డు షేక్‌రసీదాబేగం, 33వ వార్డు ఎల్లుట్ల షేక్షావలి, 34వ వార్డు రుక్సార్, 35వ వార్డు ముబీన తాబ్సుమ్, 37వ వార్డు జె.సి ప్రభాకర్‌రెడ్డి, 40వ వార్డు శ్రీవాణి, 41వ వార్డు రాణి, 43వ వార్డు విజయ్‌కుమార్, 44వ వార్డు కొత్తపల్లి మల్లికార్జున, 45వ వార్డు దబ్బర మహాలక్ష్మి, 47వ వార్డు ఎస్‌పి జోసెఫ్‌రెడ్డి, 48వ వార్డు రామగిరి షమీమ్ ఉన్నారు. 18 వార్డు స్థానాలకు బరిలో ఉన్న అభ్యర్థులు. 3వ వార్డుకు మహమ్మద్ కసిఫ్ (టిడిపి), షేక్ సబ్బుర్ (వైఎస్ఆర్‌సివి), షేక్ హబీబా (ఇండిపెండెంట్) అభ్యర్థి పోటిలో ఉన్నారు. 4వ వార్డుకు మకందర్ రెహనా (వైఎస్ఆర్‌సిపి), షేక్ అబ్దుల్‌రహీం (టిడిపి), 9వ వార్డుకు అజయ్‌కుమార్ (వైఎస్ఆర్‌సిపి), విజయ్‌కుమార్ (టిడిపి), 10వ వార్డుకు కోమలి ఫరీదా (టిడిపి), గడ్డం ఓబులమ్మ (వైఎస్ఆర్‌సిపి), హరీఫాబేగం (ఇండిపెండెంట్), 11వ వార్డుకు ప్రణీత (టిడిపి), కృష్ణవేణి (సిపిఐ), 12వ వార్డుకు రాజా శిరీష (వైఎస్ఆర్‌సిపి), లక్ష్మీదేవి (టిడిపి), 13వ వార్డుకు వసంత నరసింహారెడ్డి (వైఎస్ఆర్‌సిపి), రంగనాథ్‌రెడ్డి (టీడీపీ), 19వ వార్డుకు అంజనమ్మ (టిడిపి), చరిత (వైఎస్ఆర్‌సిపి), కృష్ణమ్మ (ఇండిపెండెంట్), 23వ వార్డుకు హబీబుల్లా (టిడిపి), ప్రతాప్‌యాదవ్ (వైఎస్ఆర్‌సిపి), 25వ వార్డుకు పోతుల గంగాధర్ (బిజెపి), బాష (వైఎస్ఆర్‌సిపి), మంజుల వెంకట యోగేష్ (ఇండిపెండెంట్), 27వ వార్డుకు లక్ష్మి (టిడిపి), మల్యాల మొహసిన తరుణం (వైఎస్ఆర్‌సిపి), 30వ వార్డుకు ఎస్.అనురాధ (బిజెపి), టింకర్ సాను (వైఎస్ఆర్‌సిపి), కాకర్ల హసీనా బేగం (ఇండిపెండెంట్), అమృతవాణి (ఇండిపెండెంట్), 36వ వార్డుకు జ్యోతి (టిడిపి), విజయభాస్కర్ (వైఎస్ఆర్‌సిపి), 38వ వార్డుకు వెంకట సుబ్బమ్మ (టిడిపి), రంగమ్మ (వైఎస్ఆర్‌సిపి), శాంతి (ఇండిపెండెంట్), 39వ వార్డుకు అఖిల (టిడిపి), రామకృష్ణమ్మ (వైఎస్ఆర్‌సిపి), 42 వార్డుకు మోహర్ హుస్సేన్ (టిడిపి), షేక్ సిలార్‌వలి (వైఎస్ఆర్‌సిపి), 46వ వార్డులో సంపంగి లక్ష్మీదేవి (వైఎస్ఆర్‌సిపి) శ్రీదేవి (టిడిపి) అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారందరూ ప్రచారం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శివరామకృష్ణ ఏకగ్రీవమైన వారికి డిక్లరేషన్ ఫారాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.






## మైక్రో అబ్జర్వర్లు విధులపై శిక్షణ





మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్, మాస్టర్ ట్రైనర్లు, హాజరైన మైక్రో అబ్జర్వర్లు

**అనంతపురం, అక్టోబరు 25, ప్రభాతవార్త**

ఎన్నికల సందర్భంగా మైక్రో అబ్జర్వర్లు నిర్వహించాల్సిన విధులపై ఎన్నికల అధికారులు శిక్షణ నిర్వహించారు. ఆదివారం స్థానిక కౌన్సిల్ సమావేశపు హాలులో నోడల్ అధికారి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్, స్పెషల్‌గ్రేడ్ రిటైర్ట్ డిప్యూటి కలెక్టర్ గోవిందరాజులు, అదనపు ఎన్నికల అధికారి,నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షతన మైక్రోఅబ్జర్వులకు ఎన్నికల రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై దిశా నిర్ధేశం చేశారు.ప్రధానంగా ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమన్నారు. పోలింగ్ కేంద్రానికి ఉదయం 6 గంటలకు చేరుకుని బ్యాలెట్ బాక్స్‌లు ఖాళీలను ఏజెంట్లకు చూపించి సీల్ వేయడం, పోలింగ్ సమయంలో 17ఎ రిజిస్టర్‌లో సంతకాలు, ఓటరు గుర్తింపు, బ్యాలెట్‌పేపర్ జారీ విధానాన్ని నిశితంగా గమనించాలని, రహస్య ఓటింగ్‌కు భంగం కలుగకుండా, బూత్ లోపల ఎవరూ ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లు సీల్ సక్రమంగా వుండేలా చూడడం, స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే వరకు పరిశీలించాలనానరు. ఏవైనా అవకతవకలు, దొంగ ఓట్లు వేయడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే జనరల్ అబ్జర్వర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రోశయ్య, ఎర్రిస్వామిలు హాజరై విధి విధానాలపై తగు సూచనలు, సలహాలు అందజేశారు.

## గజవాహనంపై ఊరేగిన వేంకటరమణుడు






గజవాహనంపై విహరిస్తున్న శ్రీవారు, విద్యుత్ కాంతుల్లో రాజగోపురం

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

పట్టణంలోని పురాతన శ్రీచింతల వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీచింతల వేంకటరమణస్వామి వేణుగోపాలస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అర్చకులు మురళీకృష్ణ అయ్యంగారు. చింతలరాయన్, శ్రీనివాసదేశికన్‌లు శ్రీదేవి, భూదేవి సమేత చింతల వేంకటరమణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై పురవీధుల్లో మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు గ్రామోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలకు పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. విద్యుత్ కాంతులతో ఆలయం శోభాయమానంగా వెలిగిపోతోంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు జైని లక్ష్మినారాయణ, డి.రాధాకృష్ణ, జలదుర్గం దామోదర్‌దాస్, కొండకుల సంజమ్మ, పి.వాణి, కె.నరసింహాచారి, దుద్దేల షర్మిల, బి.పెద్దక్క, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సీమ నుండి మొదటి హైకూ సంపుటి "హిమాలయాలు"

**- బండినారాయణ స్వామి**



వి.చంద్రశేఖరశాస్త్రి (చం.) రాసిన "హిమాలయాలు" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బండి నారాయణస్వామి

**అనంతపురం, అక్టోబర్ 25 ప్రభాతవార్త బ్యూరో**

తాత్త్విక, వ్యక్తిత్వ వికాస నేపథ్యం గల హైకూ కవిత్వం అనంతపురం నుంచి రావడం ఆశ్చర్యకరమైన విషయమని వి. చంద్రశేఖరశాస్త్రి(చం.) రాసిన "హిమాలయాలు" సహానుభూతి హైకూలు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రఖ్యాత రచయిత బండి నారాయణస్వామి అన్నారు. స్థానిక మూడవ రోడ్డు లోని వేదిక ఫర్ వేడుక మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చంద్రశేఖర్ శాస్త్రి (చం.) రాసిన హిమాలయాలు పుస్తకాన్ని ఆవిష్కరించి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. హైకూ కవిత్వం రాయడానికి అవసరమైన సున్నితత్వము, సౌమ్యత తన స్వభావంగా కలిగి ఉండడం వల్లనే చం.హైకూలు రాయగలిగాడు అని సభకు అధ్యక్షత వహించిన తూముచర్ల రాజారామ్ తెలియజేశారు. హైకూలలో ఉండవలసిన క్లుప్తత, గాఢత, నవ్యత కలిగిన చం. రాసిన హైకూలలో తాజాదనం ఉంది అని విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ హైకూకవి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కరువు సీమ అయిన అనంతపురం నుండి చం.హైకూలు పుస్తకంగా రావడం సాహిత్యంలో ఒక మలుపు అని ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మంత్రి కృష్ణమోహన్ అభిప్రాయపడ్డారు. ఇదే పుస్తకములోని హైకూలను ఆంగ్లం లోకి అనువదించిన శంకర్ నారాయణ గారి అనువాద సరళి భావానుగుణ్యంగా సవ్యంగా సాగిందని సభలో పాల్గొన్న విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకులు గొల్లాపిన్ని సీతారామశాస్త్రి తమ ప్రసంగంలో తెలియజేశారు. నానీలు,రెక్కలు, వ్యంజకాలు అనంతపురం నుండి వెలువడినప్పటికీ మొట్టమొదటిగా హైకూలను కవితా సంపుటిగా తెచ్చిన ఘనత తనకు కలగడం పట్ల కవి చంద్రశేఖర శాస్త్రి(చం.) స్పందిస్తూ అనంత సాహితీ లోకానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంచి కవిత్వ పుస్తకాన్ని అనువాదం చేసే అవకాశం తనకు లభించడం పట్ల ఆంగ్ల అనువాదకులు శంకర్ నారాయణ్ తమ హర్షాన్ని వెలిబుచ్చారు. హిమాలయాలు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా జరిగిన హైకూ కవి సమ్మేళన కార్యక్రమంలో కవులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిలు కూరి దీవెన, గుడిపాటి సూర్యం, జూటూరు షరీఫ్, లీలా మనోహర్, నరసిరెడ్డి, విశ్వనాథరెడ్డి, షమీవుల్లా, రియాజ్, నాగేంద్ర, టి.వి.రెడ్డి, అశ్వర్థరెడ్డి, పూజారి ఈరన్న, ఏలూరి యంగన్న, శ్యామ సుందర శాస్త్రి పాల్గొన్నారు.

## నెల రోజులుగా తాగునీటి సమస్య..



దూర ప్రాంతాల నుండి నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

### ప్రజల గోడు పట్టించుకునేదెవరు?

### - ఎన్‌పి కుంట మండలం తాటిమనుగుంత గ్రామం

**నంబులపూలకుంట, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

తాటిమనుగుంత గ్రామంలో గత నెల రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 100కు పైగా కుటుంబాలు నివసిస్తుండగా, తాగునీరు అందక చిన్నపిల్లలు, వృద్ధులు సహా గ్రామ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో నీళ్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని ప్రజలు అంటున్నారు. గ్రామంలో నీళ్లు సక్రమంగా వస్తుంటే, ప్రజలు ఊరికి దూరంగా ఉన్న బోరుబావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన అవసరం ఏముంది..? ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అధికారుల మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించాల్సిన అవసరం లేదా..?

**ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించాలి!**

తాటిమనుగుంత గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, గ్రామ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. ప్రజలకు తాగునీరు అందించడం అధికారుల బాధ్యత. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రామస్తుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామని, ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు.. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించండిఅంటూ ప్రజలు వేడుకుంటున్నారు.

## గురుకుల ప్రిన్సిపాల్‌పై వరుస ఆరోపణలు!




### విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్నట్లు వీడియో వైరల్!

### గతంలో ఏసీబీకి చిక్కి సస్పెన్షన్.. అయినా మారని తీరు?

### పలు శాఖాపరమైన చర్యలు తీసుకున్నా మార్పు లేదంటున్న సిబ్బంది

### తాజా ఘటనపై స్పందించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాత్రి సమయంలో విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్నట్లు చూపించే వీడియో రెండు రోజుల క్రితం బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించడంతో వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది.

**విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్నట్లు వీడియో**

కళ్యాణదుర్గంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాత్రి సమయంలో విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్నట్లు వీడియోలో కనిపిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు విద్యాబోధనతోపాటు క్రమశిక్షణ, భద్రత, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**గతంలో ఏసీబీకి చిక్కి సస్పెన్షన్!**

సదరు ప్రిన్సిపాల్ గతంలో ఏసీబీకి చిక్కడంతో సస్పెండ్ అయ్యారు. ఇప్పటికే ఆయనపై పలు శాఖాపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, వ్యవహారశైలిలో మార్పు రావడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నట్లు సమాచారం. గతంలో చర్యలు ఎదుర్కొన్న అధికారిపై తాజాగా మరో వివాదం తెరపైకి రావడం చర్చకు దారితీసింది. అయితే, గత ఏసీబీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, తీసుకున్న శాఖాపరమైన చర్యల క్రమం అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సి ఉంది.

**స్పందించిన గిరిజన సంక్షేమ శాఖ**

వైరల్ వీడియో, ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. అందుబాటులో ఉన్న పత్రం ప్రకారం, 24.10.2026న సంబంధిత అంశాలపై విచారణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వీడియోలోని దృశ్యాల వెనుక ఉన్న వాస్తవాలు, ఘటన జరిగిన పరిస్థితులు, సంబంధిత వ్యక్తుల పాత్రపై సమగ్రంగా పరిశీలన జరగాల్సి ఉంది.విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు: గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. విద్యార్థులతో వ్యక్తిగత సేవలు చేయించుకుంటున్నారనే ఆరోపణలు వచ్చినప్పుడు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు. గతంలో ఏసీబీ కేసు, సస్పెన్షన్, ఇతర శాఖాపరమైన చర్యల నేపథ్యంలో ప్రస్తుత ఘటనపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. విచారణ నివేదికలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా ఆరోపణలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## విజేతలకు బహుమతుల ప్రధానం

**అనంతపురం సిటీ, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

యువ ఆవిస్కర్తలను ప్రోత్సహించడం, తమ ప్రతిభను ప్రదర్శించడం పరిశ్రమలతో అనుసంధానం చేయడం, ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలిచేందుకు ఇన్నోవేటర్ కాంక్లేవ్ 2026 జాతీయ స్థాయి వేదికగా నిలిచిందని పలువురు వక్తలు కొనియాడారు. జెఎన్‌టియుఎ వేదికగా నిర్వహించిన ఇన్నోవేటర్స్ కాంక్లేవ్-2026 ఆదివారం ముగిసింది. విస్తార విద్యానిధి ట్రస్టు ఆధ ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సదస్సుకు 3వేల మ ందికిపైగా విద్యార్థులు 300పైగా స్టార్టప్‌ల ప్రతినిధులు, 80 మందికిపైగా పరిశ్రమల ప్రముఖులు పాల్గొన్నారు. ఉన్నత విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగం పరిశోధన, వ్యవస్థాపకతకు చెందిన ప్రతినిధులను ఒకే వేదికపై తీసుకొచ్చేందుకు ఇన్నోవేటర్స్ కాంక్లేవ్ వేదికగా నిలిచింది. రెండో రోజు సదస్సులో భాగంగా దేశాభివృద్దిలో ఆవిష్కరణల పాత్ర స్టార్టప్ ఇంక్యుబేషన్, నిధుల సమీకరణ, సాంకేతికత చట్టం పరిపాలన వంటి అంశాలపై చర్చించారు. ప్రధానంగా స్టార్టప్‌ల అభివృద్ధి ప్రక్రియ, ఇంక్యుబేషన్ వ్యవస్థ నిధుల సమీకరణలో ఎదురయ్యే సవాళ్లు, వ్యాపార ఆలోచనలను స్థిర మైన సంస్థలుగా అభివృద్ధి చేయడం వంటి చర్చలు నిర్వహించారు. కృత్రిమ మేధస్సు(ఎఐ) సైబర్ భద్రత, భవిష్యత్తు సాంకేతికతలపై నిర్వహించిన చర్చ




యువ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకే ఇన్నోవేటర్ కాంక్లేవ్

ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన హ్యాకతాన్‌లో మెడోరా జట్టుకు ప్రథమ బహుమతి దక్కింది. విజేతలకు ప్రథమ బహుమతిగా టీం మెడోరా జట్టుకు రూ.5లక్షలు, టీం వింత్రా జట్టుకు రూ.3 లక్షలు, టీం ఇంపీరియన్ జట్టుకు రూ.లక్ష, జెఎన్‌టియుఎ విసి సుదర్శన్‌రావుతోపాటు పలువురు ప్రముఖులు, నిర్వహకుల చేతులు మీదుగా అందజేశారు.

# దుర్గంలో మైనార్టీలు కూటమి వైపే

- టీడీపీలో చేరిన మాజీ - వైస్ చైర్మన్ వలీ భాష



తెలుగుదేశం పార్టీలో చేరిన వైసిపి

రాయదుర్గం అక్టోబర్ 25 ప్రభాతవార్త

రాయదుర్గం ముస్లిం మైనారిటీ సోదరులు ఎల్లప్పుడూ కూటమివైపోయినని తనపై చూపుతున్న అభిమానం మరువలేనిదని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వలీ భాష తన అనుచరులతో సహా 50 కుటుంబాలు ఆదివారం 6వ వార్డులో తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయన టీడీపీలో చేరడం హర్షణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలీ భాషకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ, మైనారిటీలను వైఎస్సార్‌సీపీ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేస్తోందని విమర్శించారు. మైనారిటీల సంక్షేమం, అభివృద్ధితో పాటు రాజకీయంగా అండగా నిలుస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడేనని పేర్కొన్నారు. మైనారిటీలపై తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రత్యేక అభిమానంతోనే దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలుకాని అనేక సంక్షేమ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్నామని తెలిపారు. దళితులు, మైనారిటీలు, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత, తగిన గుర్తింపు కల్పించి పదవులు అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 35 ఏళ్లపాటు పాలించినప్పటికీ, కొన్ని కుటుంబాలకే రాజకీయ ప్రాధాన్యత లభించిందని విమర్శించారు. అయితే, నేడు ఎంతటి ధనవంతుడైనా ఎన్నికల్లో గెలవాలంటే పేదల ఇంటి వద్దకు వెళ్లి ఓటు అడగాల్సిన పరిస్థితిని తీసుకొచ్చిన చరిత్ర తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఆదినుంచి టిడిపి పేదలకు రాజకీయంగా గుర్తింపు, ప్రాధాన్యత కల్పించిందని తెలిపారు. ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేసి గెలవడంలో ఇబ్బందులు ఎదుర్కొనే మైనారిటీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో కోఆప్షన్ సభ్యుల వ్యవస్థను టీడీపీ తీసుకొచ్చిందని వివరించారు. మైనారిటీలకు సముచిత స్థానం కల్పిస్తూ, వారి అభ్యున్నతికి అండగా నిలుస్తున్న తెలుగుదేశం పార్టీ వెంటే మైనారిటీలంతా ఉన్నారన్నారు. టీడీపీలో చేరిన వలీ భాషకు పార్టీతో పాటు కూటమి ప్రభుత్వ పరంగాను తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఎమ్మెల్యే కాలవ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పరిశీలకులు గుర్రప్ప చైర్మన్ అభ్యర్థి ్నటకశాల హనుమంతు, మాజీ వైస్ చైర్మన్ కడ్డీపుడి మహబూబ్ బాషా, అవిస్ ప్రసాద్, సెంట్రల్ స్టోర్ అధ్యక్షుడు పూజారి శివ, జీలాన్, సనవుల్లా,బంగి శంకర్, డబ్బిడి మంజు,టైలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాగి పంటల నాణ్యత ప్రమాణాల పరిశీలన



రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గుడిబండ అక్టోబర్ 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిగతుర్పి, తాళ్ళకెర,ముత్తుకూరు గ్రామాల్లో రాగి పంటలో భాగంగా జీపీపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీకి చెందిన ఆర్గానిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట సునీల్ కుమార్ రెడ్డి ఆయా గ్రామాల్లో సాగు చేసిన రాగి పంటలను సందర్శించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. రైతులు సాగు చేసిన రాగి పంట నుంచి నమూనాలను సేకరించి, వాటి నాణ్యత ప్రమాణాలను ధ్రువీకరించే ప్రక్రియ చేపట్టారు. అనంతరం గుడిబండ రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్గానిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట సునీల్ కుమార్ రెడ్డి, రైతు సేవా కేంద్రం అధికారులు నాగేష్, ప్రకాష్, గుడిబండ ఎఫ్‌పీఓ సిసి దేవరాజు, ప్రవీణ్, పవిత్రతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున గుత్తి విద్యార్థులు ఎంపిక

గుత్తి, అక్టోబర్ 25 ప్రభాతవార్త



విద్యార్థులు ఎంపికైన దృశ్యం

రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-14 క్రికెట్ పోటీలకు గుత్తికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్డీటి క్రికెట్ కోచ్ మహేశ్వర్ తెలిపారు. స్థానిక ఏవిఆర్ స్కూల్లో చదువుతున్న కౌశిక్, రెహనా స్కూల్లో చదువుతున్న అక్రమ్ నవంబర్ 1 నుండి 14 వరకు చిత్తూరు జిల్లా వాయల్పాడులో జరిగే ఇంటర్ డిస్టిక్ టీంలో వారు ప్రాతినిథ్యం వహిస్తారని ఆయన తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికై జాతీయస్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

## అక్రమ మద్యంతో పాటుగా వాహనం సీజ్



మద్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 25 ప్రభాతవార్త

గుత్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆదివారం సిఐ ఉమాదేవి ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు మండలం గ్రామంలో మొలకతాళ్ల గ్రామంలో రామాంజనేయులు అనే వ్యక్తిని అరెస్టు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన అతని వద్ద ఓల్డ్ అడ్మిరల్, వీఎస్‌ఓపి 48 మద్యం బాటిళ్లను, 12 కింగ్‌ఫిషర్ బీరు బాటిళ్లను స్వాధీన పరచుకొని ద్విచక్రవాహనమును సీజ్ చేశామని సిఐ ఉమాదేవి తెలిపారు. నిందితుడుని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ ఆదేశించారని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయాలు, నాటు సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

## మండల కన్వీనర్ గా మురడి మాజీ ఎంపీటీసీ

డి.హిరెహాళ్ అక్టోబర్ 25 ప్రభాతవార్త



మండల నూతన కన్వీనర్ గా గంగాధర

రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, రాష్ట్ర తెదేపా పోలీస్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ మండల నూతన కన్వీనర్ గా మురడి తాజా మాజీ ఎంపీటీసీ గంగాధర ను ఎంపిక చేసినట్లు తెలిసింది. సోమవారం డి.హిరెహాళ్ మండల పరిధిలో సోమలాపురం, చెర్లోపల్లి గ్రామాల మధ్య ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించనున్న స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల సభ్యులు తదితరులు పాల్గొననున్న విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ప్రకటించనున్నట్లు సమాచారం. మండల తెదేపా కన్వీనర్ మార్పు విషయమై మండల పరిధిలోని తెదేపా ప్రధాన నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ వర్గాల గ్రామస్థాయి నాయకులు పేర్కొన్నారు. మండల తెదేపా కన్వీనర్ గ మాజీ ఎంపీటీసీ గంగాధర ను ఎంపిక చేయడంలో రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉండాల హనుమంతురెడ్డి ప్రముఖ పాత్ర పోషించినట్లు తెలిసింది. ప్రస్తుతం మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి సతీమణి ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలవడం, ఆమె బీసీ మహిళ కావడం, డి.హిరెహాళ్ మండల ఎంపీపీ బీసీ మహిళకు కేటాయించడంతో ఆమెను ఎంపీపీగా ఎంపిక చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో తెదేపా మండల కన్వీనర్ మార్పు తప్పనిసరి కావడం, మురడి మాజీ ఎంపీటీసీ ఎంపీపీ పదవి, జడ్పిటిసి పదవి ఆశించగ ఆ రెండు ఆయనకు దక్కకపోవడంతో తప్పనిసరిగ ఎమ్మెల్యే మండల కన్వీనర్ గా ప్రకటించి సమన్యాయం చేయనున్నారని తెదేపా శ్రేణులు పేర్కొంటున్నారు.

## ఎన్నికల్లో ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా సంతోషంగా వేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగ మధు

కనేకల్లు అక్టోబర్ 25 ప్రభాతవార్త

కనేకల్లు మండలంలోని జక్కులవడికి మరియు గణిగెర గ్రామాలలో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్, గ్రామసభ నిర్వహణ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ప్రజలు శాంతియుత వాతావరణంలో, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కణేకల్ ఎస్సై వై.నాగమధు సూచించారు. మండలంలోని జక్కులవడికి మరియు గణిగెర గ్రామలలో ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి ఆయన ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిష్పాక్షికంగా ఓటు వేయాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, నేరాల నివారణకు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన టిడిపి నాయకులు



బొమ్మనహాల్ అక్టోబర్ 25 ప్రభాతవార్త

బొమ్మన హాల్ మండల కేంద్రంలో రాయదుర్గం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు కొత్తపల్లి మల్లికార్జున సీనియర్ నాయకుడు కొత్తపల్లి తిమ్మరాజు ని మాజీ సర్పంచ్ పై కేశప్పమర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. దర్గా హున్నూరు గ్రామ టీడీపీ నేతలు ఎంపిటిసి అభ్యర్థులు, టిడిపి నాయకులు ముల్లంగి, నారాయణస్వామి, వి ఎల్, రామాంజనేయులు, ఎంపీటీసీ అభ్యర్థులు ఆనంద్,వి ఎల్, దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



స్థానిక ఎన్నికలపై గొడిసెలపల్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ ఐ



కూడ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

డి.హిరెహాళ్ అక్టోబరు 25 ప్రభాతవార్త

స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలను పురస్కరించుకొని ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేల మసులుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం రాత్రి డి.హిరెహాళ్ మండలం ఒడిశాలపల్లి,కూడ్లూరు గ్రామాల్లో ఎస్ ఐ తన సిబ్బందితో కలిసి ప్రజలు, యువతతో సమావేశం నిర్వహించి ప్రతి ఓటరు తమ ఓటును ఎలా వినియోగించుకోవాలో సూచించారు. స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎవరైన అరాచకాలు సృష్టిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఎన్నికల నిబంధనలను పాటించాలని ఆయన ఈ సందర్భంగ సూచించారు. పోలింగ్ సందర్భంగ ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఏవైనా పొరపాట్లకు, తప్పిదాలకు తావిస్తే పరిణామాలు వేరుగ ఉంటాయని ఆయన తెలిపారు. కావాలని గ్రామాల్లో ఎవరైనా ఎన్నికల సమయంలో అరాచకాలు సృష్టించి ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. హెచ్చరించారు. మండలంలోని ప్రతి గ్రామం పైన ప్రత్యేక పోలీసు నిఘా ఉంటుందని ఎవరైన చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతూ, గొడవలకు కారణమైతే అలాంటి వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

# ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు..!

- విడపనకల్లు మండలంలో అత్యధికంగా 49.6 మిల్లీమీటర్ల వర్షం
- ఉరవకొండ, వజ్రకరూరు, బెలుగుప్ప మండలాల్లో సాధారణ వర్షం
- ఉధృతంగా ప్రవహించిన ఛాయాపురం, పొలికి-పెంచలపాడు వంకలు



చెరువును తలపిస్తున్న వ్యవసాయ భూమి



ఉధృతంగా ప్రవహిస్తున్న పొలికి-పెంచలపాడు వంక



ఛాయాపురం వంక ప్రవహిస్తున్న దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 25 ప్రభాతవార్త

ఉరవకొండ నియోజకవర్గంలో శనివారం రాత్రి మొదలు ఆదివారం తెల్లవారుజాము వరకు వివిధ మండలాల్లో భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం రాత్రి వాయుగుండంగా బలపడటంతో విడపనకల్లు మండలంలో అత్యధికంగా 49.6 మిలీమీటర్ల వర్షం నమోదైంది. ఉరవకొండ మండలంలో 14.2 మిల్లీమీటర్లు, వజ్రకరూరు మండలంలో 10.2 మిల్లీమీటర్లు, బెలుగుప్ప మండలంలో 9.2 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా కూడేరు మండలంలో అత్యల్పంగా 4.6 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. శనివారం రాత్రి చినుకులతో ప్రారంభమైన వర్షం ఉరుములు, మెరుపులతో తెల్లవారుజాము వరకు ఏకధాటిగా కురిసింది. భారీ వర్షం రాకతో విడపనకల్లు మండలంలో ఛాయాపురం, పొలికి-పెంచలపాడు వంకలు ఉధృతంగా ప్రవహించగా కొన్ని గంటలపాటు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివిధ గ్రామాల పరిధిలో చెరువులు, కుంటల్లో నీరు చేరగా పంట పొలాల్లో నీరుచేరి చెరువులను తలపించాయి. రబీ పంట కాలం ప్రారంభమైన తరువాత ఇదే పెద్ద వర్షం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు సిద్ధ చేసుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు పప్పుశెనగ పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఉరవకొండ మండలంలోని కొన్ని గ్రామాల్లో తుంపర జల్లులతో కూడిన వర్షం కురవడం విశేషం.

## కూటమి విస్తృత సమావేశం కు తరలిరండి

డి.హిరెహాళ్ అక్టోబరు 25 ప్రభాతవార్త



మండల కన్వీనర్

స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కూటమి పార్టీల విస్తృత స్థాయి సమావేశం కు తరలిరావాలని తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం సాయంకాలం డి.హిరెహాళ్ మండలం సోమలాపురం, చెర్లోపల్లి గ్రామాల మధ్య వెలిసిన ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెదేపా మండల కన్వీనర్ ప్రకటన ద్వారా సమాచారం చేరవేశారు. ఎమ్మెల్యే కాలవ హాజరుకానున్న ఈ సమావేశం కు కూటమి నాయకులు, మండల స్థాయి నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, బి.ఎల్.ఏలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అందరూ ఈ సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా మండల కన్వీనర్ విజ్ఞప్తి చేశారు.

## ఎంపీటీసీ అభ్యర్థి నామినేషన్ విత్డ్రా



నామినేషన్ విత్డ్రా చేసుకుంటున్నా ఎంపీటీసీ అభ్యర్థి లోకేష్

డి.హిరెహాళ్ అక్టోబరు 25 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగ వైకాపా అభ్యర్థిగ ఎంపీటీసీ స్థానంకు నామినేషన్ దాఖలు చేసిన లోకేష్ ఆదివారం తన నామినేషన్ ను విత్డ్రా చేసుకున్నారు. డి. హిరెహాళ్ మండలం కాదలూరు ఎంపీటీసీ అభ్యర్థిగ నామినేషన్ దాఖలు చేసిన ఆయన తన నామినేషన్ ను అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఎంపీడీవో దాస్ నాయక్ ను సంప్రదించి తన నామినేషన్ ను రా చేసుకున్నట్లు పాలనాధికారి బలరామరావు తెలిపారు. శుక్రవారం నామినేషన్ పత్రాలు సమర్పించిన ఆయన ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తన నామినేషన్ విత్డ్రా చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఓబులాపురం, కాదలూరు, చెర్లోపల్లి ఎంపీటీసీ తెదేపా అభ్యర్థులు బసమ్మ, హరిజన సరోజమ్మ, వైకాపా అభ్యర్థి హరిజన దుర్గమ్మలు తమ నామినేషన్లను విత్డ్రా చేసుకున్నారు.

## అత్యంత వైభవంగా మహాగణపతి నిమజ్జనం

పావగడ, అక్టోబర్ 25 ప్రభాతవార్త



మహాగణపతిని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ పట్టణంలోని మధుగిరి ఊరు వాకిలిలో ప్రతిష్ఠాపన చేసిన హిందూ మహాగణపతి ప్రతిమను ఆదివారం హిందూ మహాగణపతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిమజ్జనా కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూ మహాగణపతి ప్రతిమను పట్టణంలోని పురవీధులలో ఊరేగించారు. యువతీ యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు కార్యక్ర



మంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. నిమజ్జనం తరువాత భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 3 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## పిఓలు ఏపీవోలు శిక్షణ కార్యక్రమంకు హాజరుకండి : ఎంపీడీవో

బ్రహ్మసముద్రం అక్టోబర్ 25 ప్రభాతవార్త

స్థానిక సంస్థల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులకు హాజరయ్యే పిఓలు ఏపీవోలకు సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏకాంబరేశ్వరయ్య పత్రిక ముఖంగా తెలియజేశారు ఈ శిక్షణా కార్యక్రమం కు పి ఓ లో ఏపీవోలు హాజరుకావాలని తెలియజేశారు.

## నేరపూరిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

వెలిగొండ గ్రామంలో గ్రామస్తులతో ఎస్ఐ పి.జనార్ధన నాయుడు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ పి.జనార్ధన నాయుడు



పోలింగ్ స్టేషన్ వద్ద ఎస్ఐ, సిబ్బంది

ఉరవకొండ, అక్టోబర్ 25 ప్రభాతవార్త

నేర పూరిత చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉరవకొండ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.జనార్ధన నాయుడు హెచ్చరించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్ఐ పి.జనార్ధన నాయుడు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు భంగం కలిగించాలని ప్రయత్నిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనం అవుతాయని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పోలింగ్ స్టేషన్ సందర్శించారు.

## పోలీసుల ఆధ్వర్యంలో వాక్ విత్ ఫ్రైడ్



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ శోభారాణి

పుట్టపర్తి, అక్టోబర్ 25, ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ మాణిక్యరావు పర్యవేక్షణలో, పట్టణ సిఐ యువరాజు సూచనలతో ఎస్ ఐ శోభారాణి పుట్టపర్తి పట్టణంలో ఆదివారం సాయంత్రం"వాక్ విత్ ఫ్రైడ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై, పోలీసు సిబ్బందితో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గణేష్ గేట్, సత్తెమ్మ గుడి వరకు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించడం, పోలీసుల పట్ల ప్రజలకు మరింత నమ్మకాన్ని కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధనలు తప్పకుండా అందరూ పాటించాలని సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఎస్సై తెలిపారు.

## పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోండి

పోస్టల్ బ్యాలెట్ ద్వారా అర్హులైన ఉద్యోగులు ఈ నెల 27వ తేదీలోగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య

ధర్మవరం, అక్టోబరు 24 ప్రభాతవార్త

మున్సిపల్ ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకుని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య సూచించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన సవరించిన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మున్సిపల్ ఓటర్లుగా నమోదై ఉండి, ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఈ నెల 27వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఉద్యోగులు గడువులోగా ఓటు వేసి ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

04ATP25_04ATP25.qxd 25-10-2026 PM 11:01 Page 1



## సామాజిక సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం

**- డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ విరుపాక్షిరెడ్డి, డాక్లర్ నల్లపాటి తిరుపతినాయుడు**



సమావేశంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ విరుపాక్షిరెడ్డి.

**పామిడి, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

సామాజిక సేవే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ కృషి చేస్తోందని ఆసంస్థ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ విరుపాక్షిరెడ్డి, జోనల్ చైర్మెన్, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి డాక్లర్ నల్లపాటి తిరుపతినాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ వారు ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విరుపాక్షిరెడ్డి, డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ సృష్టిలో మానవజన్మ అద్భుతమైనదని అందులో కంటి చూపు దేవుడు ఇచ్చిన వరం అంటూ ప్రతిఒక్కరూ కళ్ళను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్ ద్వార ఆరోగ్యం పరంగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఈక్రమంలో తోటివారిని సేవా దృక్పదం వైపుగా నడిపిస్తున్నామని తెలిపారు. అనంతరం బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ దృష్టి కంటిచూపు మందగించిన 130 మందిని పరీక్షించి వారిలో 67 మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కంటి పరీక్షలు చేయించుకోవటానికి వచ్చిన వారితో శ్రీ వాసవి కళ్యాణ మండపం కిటకిటలాడగా ఉచిత కంటి మెగా వైద్యశిభిరానికి విశేష స్పందన లభించినట్లైంది. వైద్యశిభిరానికి వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్స్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శాంతిప్రియ, అద్యక్షులు పత్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యనిర్వాహకుడు ఆర్‌ఎంపీ వైద్యులు గంగశేఖర్, పత్రా నరేష్‌కుమార్, షేక్షావలి, మహేష్, శ్రీనివాస్, మక్బుల్, నల్లయ్య, ఉపేంద్ర, మానవహక్కుల సంఘం సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్, శంకరకంటి ఆసుపత్రి మేనేజర్ శివ, లక్ష్మీ, శంకర్‌కంటి హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల జీవితాల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తున్న మానవీయ కార్యక్రమం

**700 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అమరిక శిబిరంలో మాజీ మంత్రి బి శ్రీరాములు**



కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బి శ్రీరాములు



**బళ్లారి, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

స్థానిక సన్మార్గ గెలెయర బలగఖి ఉదయ్‌పూర్‌కు చెందిన ఖినారాయణ్ సేవా సంస్థాన్‌ఖి సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలను అమర్చే భారీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాదాలు, అనారోగ్యాలు లేదా ఇతర కారణాల వల్ల అవయవాలను కోల్పోయి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు చేయూతనివ్వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. నగరంలోని సిరుగుప్ప రోడ్డులో ఉన్న ఖిక్లాసిక్ ఫంక్షన్ హాల్‌ఖిలో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా 700 మందికి పైగా దివ్యాంగులు తరలివచ్చారు. ప్రస్తుతం ఇక్కడ కృత్రిమ అవయవాలను అమర్చే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. అవయవాలను కోల్పోయి, దైనందిన జీవితం కోసం ఇతరులపై ఆధారపడుతున్న వారికి, స్వయం సమృద్ధిగా జీవించే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ శిబిరం, మానవీయ సేవకు నిదర్శనంగా నిలుస్తోంది. సుదూర ప్రాంతాల నుండి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన దివ్యాంగులు, ఈ కృత్రిమ అవయవాల అమరిక తమ జీవితాల్లో కొత్త ఆశలను నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాజీ మంత్రి బి. శ్రీరాములు మాట్లాడుతూ, దివ్యాంగులకు సేవ చేయడం అత్యున్నత మానవీయ కార్యమని పేర్కొన్నారు. శారీరక వైకల్యాల వల్ల ఇబ్బందులు పడుతున్న వారికి కృత్రిమ అవయవాలను అందించడం ద్వారా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం జరుగుతోందని ఆయన అన్నారు. దివ్యాంగులు సమాజంలో ఎవరికీ భారం కాకుండా, ఆత్మగౌరవంతో జీవించాలని ఆయన నొక్కి చెప్పారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపట్టడానికి వివిధ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కృత్రిమ అవయవాల అమరిక శిబిరాలు కేవలం శారీరక సహాయాన్ని అందించడమే కాకుండా, దివ్యాంగులలో భవిష్యత్తు పట్ల కొత్త ఆశలను, ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## డిక్లరేషన్ ఫారం అందుకున్న 34వవార్డు కౌన్సిలర్ అభ్యర్థి



**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని 34వవార్డు ఆసుపత్రిపాలెం తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి రుక్సార్ ఆదివారం డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. 34వవార్డు ఏకగ్రీవం కావడంతో కౌన్సిలర్ అభ్యర్థి రుక్సార్‌కు ఎన్నికల అధికారి రాజేశ వ్ర్‌రెడ్డి డిక్లరేషన్ ఫారం అందచేశారు.

## కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు

**అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 25 ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు ఎవరూ రాకూడదని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల గడువు పొడిగింపు!

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు గమనించాల్సిన అంశాలు: దరఖాస్తు చేసుకునే ముందు విద్యార్థులు తమ అర్హతలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలను సరిచూసుకోవాలి. దరఖాస్తు సమర్పించిన తర్వాత సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్దేశించిన ప్రక్రియను పూర్తి చేయాలి. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎన్.అయూబ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# భారత విప్లవ పంథా రూపకర్త కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి దృక్పథాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే నేటి కర్తవ్యం

వర్ధంతి సభలో వక్తలు పిలుపు




సభలో మాట్లాడుతున్న తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఝాన్సీ





సభకు హాజరైన అభిమానులు

**అనంతపురం, అక్టోబర్ 25, (ప్రభాతవార్త బ్యూరో)**

అనంతపురం జిల్లా వజ్రకరూర్ వైఢూర్యం తరిమెల నాగిరెడ్డి అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఆ యోధుని జీవితంపై రూపొందించిన డాక్యుమెంటరీ (లఘు చిత్రం) ఆదివారం 25వ తేదీన అనంతపురం ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్లో ప్రదర్శించారు. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా సభ జరిగింది. ట్రస్ట్ చైర్మన్ ఎస్. ఝాన్సీ సభకు అధ్యక్షత వహిస్తూ కమ్యూనిస్టు ఉద్యమంలో కామ్రేడ్ టిఎన్ పాత్ర విశిష్టమైనదన్నారు. చట్టసభలలో ప్రజా సమస్యలపై గళం విప్పడమే కాక, బయట అనేక ప్రజా పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడన్నారు. ట్రస్టు పూర్వ ఛైర్మన్, జనసాహితి నాయకులు డాక్టర్ బి. సూర్య సాగర్ మాట్లాడుతూ కామ్రేడ్ నాగిరెడ్డి జైలులోనే ఉండి రూపొందించిన "తాకట్టులో భారతదేశం" రిఫరెన్స్ పుస్తకంగా ప్రాచుర్యం పొందిందన్నారు. 10 వేల కోట్లు ప్రభుత్వం అప్పు ఉండగా ఆయన అలా వ్యాఖ్యానించారని, ఇప్పుడీ అప్పు 170 లక్షల కోట్లకు చేరిందన్నాడు. ఆ గ్రంథాన్ని ఎన్ సైక్లోపీడియాగా వర్ణించారు. సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు ప్రసంగిస్తూ ఆర్థిక సమస్యలు, ధరల పెరుగుదల, సంక్షోభం వంటి వాటిని చూసినప్పుడల్లా టిఎన్ గుర్తుకు వస్తారన్నారు. యుద్ధము దాని ఆర్థిక ప్రభావం అన్న పుస్తకం అచ్చు వేసినందుకు టిఎన్ కి ఒక సంవత్సరం జైలు శిక్షను వలస పాలకులు వేసారని, ఇప్పటి మన దోపిడీ పాలకులు అంతకంటే అధ్వాన్నమైన విధానాలను అవలంబిస్తున్నారన్నారు. పాలకులు దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా అధోగతి పాలు చేసినందునే మేం ప్రజలను విప్లవించమని పిలుపునిచ్చినట్లు కోర్టులో కామ్రేడ్ టిఎన్ నిర్భయంగా ప్రకటించారని, ఆయన దృక్పథాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. లఘు చిత్ర రూపకర్తల బృందంలోని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యదర్శి ఎం. లక్ష్మి 2017లో టిఎన్ శత జయంతి సందర్భంగా ఈ చిత్ర నిర్మాణం గురించి ఆలోచన మొదలుపెట్టామని, ఇప్పటికి సఫలమయ్యామని చెప్పారు. సినీ పరిశ్రమలోని అనేకమంది ఇందులో పాలుపంచుకొని టిఎన్ పై తమ గౌరవాన్ని ప్రదర్శించారన్నారు. ఉపన్యాసకులను రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు పి. చంద్రశేఖర్ ఆహ్వానం పలికి సభను పరిచయం చేశారు. నగరంలోని పలు కాలనీల మహిళలు, కార్మికులు, ప్రజాతంత్ర వాదులు, వివిధ కమ్యూనిస్టు శ్రేణుల కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# నామినేషన్ల వేళ ప్రజాస్వామ్యంపై దాడి!

**జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేస్థాయిలో నేరాలు**

**రాప్తాడు నియోజకవర్గం చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు.**

**పరిటాల కుటుంబంపై తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నిప్పులు**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

**అనంతపురం రూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**

ఎంపిటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల దాఖలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జాతీయస్థాయి మీడియా దృష్టిని ఆకర్షించే స్థాయిలో నేరాలు, ఘోరాలు జరిగాయని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, పోలీసులు, రౌడీలు, గూండాలు కలిసి ఆర్గనైజ్డ్‌గా దాడులు చేశారని ఆరోపించారు. ఆదివారం సాయంత్రంఅనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో, ప్రత్యేకించి రాప్తాడు నియోజకవర్గంలో అత్యంత దుర్మార్గంగా దాడులు జరిగాయని ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ దాడులన్నీ ముందస్తు ప్రణాళికతో నిర్వహించారనిఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను ఏకపక్షంగా రూ.5 లక్షల బైండోవర్లు చేశారని విమర్శించారు. ఆర్గనైజ్డ్‌గా రౌడీలకు మండలాలను పంచి దాడులకు పాల్పడ్డారని ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో నేరచరిత్ర ఉన్నవారిని ముందుపెట్టి, వారికి పోలీసులు కాపలాగా ఉండేలా వ్యవహరించారని విమర్శించారు.ధర్మవరం, పావగడ, అనంతపురం అర్బన్ తదితర ప్రాంతాల నుంచి వందలాది మందిని పిలిపించి దాడులు చేయించారని ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులనుభయభ్రాంతులకు గురిచేసి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని అన్నారు.చెన్నేకొత్తపల్లిలో పది మంది అభ్యర్థుల నామినేషన్లను చింపివేసి దాడులకు పాల్పడ్డారని ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మొదటి రెండు రోజులూ అనేక ప్రాంతాల్లో నామినేషన్లు దాఖలు చేయలేని పరిస్థితి సృష్టించారని ఆరోపించారు. బసంపల్లి అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసి తిరిగి వచ్చిన వ్యక్తిపై దాడి జరిగిందని ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. పోలీసులు అతడిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించినప్పటికీ, అక్కడికి వచ్చిన టీడీపీ గూండాలు అతడి వద్ద నుంచి నామినేషన్‌అక్నాలెడ్జ్‌మెంట్ పత్రాన్ని లాక్కుని దాడి చేశారని అన్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు. బసంపల్లిలో జరిగిన తరహాలోనే రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లోనూ దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఎవరినీ నామినేషన్లు వేయ నీయకుండా అడ్డుకున్నారని, పరిటాల శ్రీరామ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలను కాకుండా, కొత్తచెరువు, నల్లచెరువు మండలాల్లో తర్జనభర్జన అనంతరం చివరకు నల్లచెరువు మండలంలో నామినేషన్ వేశారు. కానుకగా ఎంపీపీ పదవిని ఇచ్చారు. ప్రస్తుతం తగర కుంట ప్రభాకర్‌కుమారుడు రామాంజనేయులుతో హత్య, హత్యాప్రయత్నాలు చేయించి ఎంపీపీ పదవి కానుకగా ఇవ్వాలని చూస్తున్నారు. కొండారెడ్డి హత్య కేసు విచారణ పూర్తయిందని,రామాంజనేయులు జైలుకు వెళ్లే రోజు దగ్గర పడిందన్నారు. రౌడీలు, గూండాలు దౌర్జన్యాలకుపాల్పడుతుంటే పోలీసులు వారిని అడ్డుకోవాల్సింది పోయి, వారికి అనుకూలంగా వ్యవహరించారన్నారని, రాప్తాడులో రెండో రోజు వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిరగబడటంతో టీడీపీ గూండాలు పలాయనం చిత్తగించారు. శస్త్రచికిత్స చేసినప్పటికీ ఇప్పటికీ కోమాలోనే ఉన్నాడు. ఎంపీపీ అభ్యర్థిప్రసాద్‌రెడ్డిపై దాడి చేశారని,మహిళల చీరలు లాగుతూ దాడులకు పాల్పడ్డారు. ఎన్నికల్లో పోటీ చేయకుండాఅడ్డుకునేందుకు మహిళలను సైతం వదలకుండా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. నాని అనే వ్యక్తిని జైలుశిక్ష నుంచి వచ్చినగురుమనోహర్‌నాయుడు బెదిరించి కారులో ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడు. పోలీసులు అక్కడికి రావడంతో నాని కారు నుంచి దూకి తప్పించుకుని పారిపోయాడు. ఆత్మకూరు మండలంలో టీడీపీ గూండాలకు టెంట్లు వేసి మరీ భోజన వసతి కల్పించారు. టీడీపీ గూండాలు, రౌడీల దాడుల్లో కనీసం వంద మంది వరకు రక్తగాయాలపాలయ్యారు. సుమారువందసంఘటనలు జరిగాయి. నామినేషన్ల ప్రక్రియలో ఇంతటి హింస చోటుచేసుకోవడం రాష్ట్ర ఎన్నికల వ్యవస్థకు మచ్చ. రాష్ట్రవ్యాప్తంగాజరుగుతున్న దుర్మార్గాలను జాతీయ మీడియా ప్రసారం చేయడంతో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు వచ్చాయి. దీంతో చివరి రోజు నామినేషన్ల దాఖలుకు జిల్లా అధికారులు అనుమతించారు. ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థుల హక్కులను స్క్రూటినీ సమయంలో అనేక నామినేషన్ల ను రిటర్నింగ్ అధికారులు టీడీపీ నాయకులతో కుమ్మక్కయ్యి 5ఎంపీటీసీస్థానాల్లోనామినేషన్లువేయనీయలేదని, సుమారు 20కి పైగా నామినేషన్లను తిరస్కరించేలా చేశారు.పరిటాల సునీత ఆదేశాలతోనే అధికారులు నామినేషన్లనుతిరస్కరించారు.ప్రశాంతంగా ఉండే అనంతపురం రూరల్ మండలం లో దాడులు ఈ విధమైన దాడులుజరగలేదని.వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరికీ నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని,తిరస్కరించిన చోట్ల నామినేషన్ల ప్రక్రియను పునఃపరిశీలించాలి. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన అధికారులు, పోలీసులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రానున్న రోజుల్లో పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లోనూ ఇదేరకమైన దౌర్జన్యాలు చేస్తే మాత్రం చూస్తూఊరుకోం.యూనీఫాం తీసేసి టీడీపీ గూండాలతో కలిసి రండి మేము ఎదురుపడతామని కొట్టుకుందాం ఎవరిప్రతాపం ఏమిటో తెలుస్తుందని, రౌడీ నాకొడుకులనుకాపాడేందుకు పోలీసులకు ఖాకీ చొక్కాలు అవసరమా? . మమ్మల్ని అడ్డుకోవడానికి బెటాలీయన్లనుతెచ్చుకుంటున్నారు.మాపై కేసులు పెట్టినావెనక్కుతగ్గం.రాప్తాడునియోజకవర్గం చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. మీ దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారు. 35 ఏళ్ల కిందట పరిటాల రవి ఎలా చేశాడో.ఇప్పుడు మళ్లీ అలానేహింసకుపాల్పడుతున్నారు. మీకు రాజకీయం, పదవులు కావాలంటే వెళ్లి చంద్రబాబు కాళ్లుపట్టుకోండి కానీ దుర్మార్గాలను ప్రోత్సహించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు బోనగిరి వరప్రసాద్ రెడ్డి, బండి పవనన్ కుమార్,లోక్ నాథ్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రామాంజనేయులు, భాను కోట శివ, పాపంపేట ప్రసాద్ రెడ్డి, వడ్డే ఆనంద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టి రిజర్వేషన్ల పెంపును 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ దళితుల ఆందోళన



నిరవధిక ధర్నా చేపట్టిన దళిత హక్కుల కమిటీ కార్యకర్తలు

**బళ్లారి, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్ కోటాను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ దళిత హక్కుల కమిటీకి చెందిన వందలాది మంది కార్యకర్తలు నిరవధిక ధర్నా చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల పెంపును రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ప్రతిఘటనకు నేతృత్వం వహించిన విఎస్ శివశంకర్ ఆరోపించారు. గతంలోని బీజేపీ ప్రభుత్వం దళిత, అణగారిన వర్గాలను మోసం చేశాయని కర్ణాటక రాష్ట్ర రైతుల సంఘం వాల్మీకి సమాజానికి చెందిన సీనియర్ నాయకుడు వి.ఎస్. శివశంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాధికారి కార్యాలయం ముందు ఖిదళిత హక్కుల కమిటీఖి మరియు ఖిమానవ బంధుత్వ వేదికఖి సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల నిరవధిక ధర్నా సత్యాగ్రహంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఎస్సీ, ఎస్టి రిజర్వేషన్ కోటాను పెంచిందని, అయితే దానికి అవసరమైన రాజ్యాంగ రక్షణ కల్పించలేదని ఆయన ఆరోపించారు. ఈ పెంపును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చకపోవడం ద్వారా దళిత వర్గాలకు అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ రిజర్వేషన్ పెంపును 9వ షెడ్యూల్‌లో చేర్చేలా చూడటానికి, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తగిన చట్టపరమైన మరియు రాజకీయ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య మరియు ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ల విషయానికి వస్తే షెడ్యూల్డ్ కులాలకు 17 శాతం షెడ్యూల్డ్ తెగలకు ఇలా వెనుకబడిన తరగతులకు కేటాయించిన 32 శాతం కలిపి మొత్తం 56 శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించేలా, వీటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని నిరసనకారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన ప్రదేశంలో మహర్షి వాల్మీకి మరియు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖిమానవ బంధుత్వ వేదికఖికు చెందిన సంగనకల్లు విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు బాదామి శివలింగ నాయక, మీనహళ్లి వెంకటేష్, సంగనకల్లు గంగాధర, దుర్గప్ప తలవార్ తదితరులు పాల్గొన్నారు. ఖిహుసేనప్ప దేవదాసి విమోచన సంఘంఖి దుర్గమ్మ, రామన్న తదితరులు ఉన్నారు.

## నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**యల్లనూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

యల్లనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కుళ్లాయప్పనాయుడు తల్లి అశ్వర్థమ్మ (90) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గ్రామానికి చేరుకొని అశ్వర్థమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రాజేంద్ర నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు అనిల్, టీడీపీ మండల కన్వీనర్ దొడ్లో రామాంజనేయులు, శింగనమల మార్కెట్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి వున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు..

**అనంతపురం క్రైమ్ అక్టోబర్ 25 ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు ప్రజలెవరూ జిల్లా పోలీసు కార్యాలయానికి రాకూడదని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

## అపస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**జిల్లా అధ్యక్షురాలిగా కళ్యాణి.. ప్రధాన కార్యదర్శిగా వై. రామన్న ఏకగ్రీవం**

**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం: నూతన కార్యవర్గం**





జిల్లా అధ్యక్షులు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై. రామన్న

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీటీఎస్) అనంతపురం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా శ్రీమతి కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై. రామన్న, గౌరవాధ్యక్షులుగా టి. నారాయణస్వామి, జిల్లా సహాధ్యక్షులుగా పి. శివప్రసాద్ నాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి వై. రామన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సంఘం తరఫున కృషి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ఎన్నికల అధికారుల సమక్షంలో ఎన్నికలు: ఈ ఎన్నికల కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల అధికారులుగా శ్రీ రామచంద్రారెడ్డి, శ్రీ వెంకటేశ్వర ప్రసాద్, శ్రీ రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ గజ్జల వెంకట్ సత్యనారాయణ, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, కళ్యాణదుర్గం జోనల్ అధ్యక్షుడు మల్లికార్జునతో పాటు వివిధ మండలాలు, జోన్ల బాధ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## తొలిరోజు నాలుగు నామినేషన్ల ఉప సంహరణ



నామినేషన్లు ఉప సంహరించుకుంటున్న అభ్యర్థులు

**అనంతపురం సిటీ, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఆదివారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉప సంహరించుకొన్నారు. స్క్రూటిని ప్రక్రియ శనివారం ముగియడంతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మొదలైంది. దీంతో గుంతకల్లు, కణేకల్లు, రాయదుర్గం, హీరేహాల్ వైసిపి అభ్యర్థులు శ్రీలత, భీమారెడ్డి, వంద్రక్క, శరత్ చంద్రారెడ్డిలు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిని, జడి ప సిఈఓ విజయలక్ష్మికి తమ ఉప సంహరణ లేఖలను అందించారు. మంగళవారం వరకు ఉప సంహరణ గడువు ఉండటంతో ఉప సంహరణ సంఖ్యపెరిగే అవకాశం వుంది.

## వైయస్సార్సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జడ్పిటిసి అభ్యర్థి మొండెం రవి కుమార్

**నల్లచెరువు అక్టోబర్ 25 ప్రభాతవార్త.**

మండలం యనమలవారిపల్లి, కే పూలకుంట కమ్మవారి పల్లి కి, చెందిన కార్యకర్తలు టీడీపీ కార్యకర్త ఏ,1 టైలర్ ఆనంద్ రావు ఆ పార్టీకి వీడ్కోలు పలికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కన్వీనర్ మరియు జడ్పీటీసీ అభ్యర్థి మొండెం రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వైయస్సార్సీపీ కండువా కప్పుకుని పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా వైయస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ విధానాలు, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున వైయస్సార్సీపీలో చేరుతున్నారని తెలిపారు. రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానికంగా పార్టీ మరింత బలపడుతుందని, రాబోయే రోజుల్లో ప్రజల సంక్షేమం కోసం అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కదిరి సమన్వయకర్త బి,ఎస్ మక్బూల్ భాష



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ భాష,

**నల్లచెరువు అక్టోబర్: 25 ప్రభాతవార్త,**

నల్లచెరువు మండలం కేంద్రంలోని మాజీ అగ్రిటెక్ అడ్వైజర్ ముస్తఫా కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న బి, ఎస్ మక్బుల్ అహ్మద్ హాజరై తోటి కార్యకర్తలు నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా, నల్ల చెరువు మండలం జడ్పిటిసి అభ్యర్థి ముండెం రవి కుమార్ రెడ్డి, నరసింహారెడ్డి మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, యనమల ఆనంద రెడ్డి, హైటెక్ రమణ , గోవింద్ రెడ్డి , బాలకృష్ణ నాయక్, అక్బర్ నజీర్ అహ్మద్. రఫీ తదితరులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు,

## డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాల రద్దు

**అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 25 ప్రభాతవార్త**

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏపీఎస్పీడీసీఎల్ ప్రతి సోమవారం నిర్వహించే 'డయల్ యువర్ ఏపీఎస్పిడిసిల్ సీఎండీ, 'డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాలను రద్దు చేసినట్లు ఆ సంస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఈ కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ మార్పును గమనించాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబరు: 1912 కు కాల్ చేయడం లేదా చాట్ బోట్ నంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.